# అభిమాని

-భోగాది వెంకటేశ్వర్

"స్వప్నా నీకు లెటర్ వచ్చిందే......

పైన అడ్రస్ కూడా లేదు. చూస్తుంటే లోకల్‌గానే పోస్ట్ చేసినట్లుంది..." ... రాణి మాటలతో కంగారుగా ఉత్తరం అందుకుని... వణుకుతున్న చేతుల్తో చించింది స్వప్న.

"ఇక్కడొద్దే-క్యాంటీన్‌కి వెళ్ళి చూద్దాం! అందులో ఏం వ్రాసి వుందో! ఇప్పుడు మనకు థర్డ్ అవర్ హిస్టరీ మేడమేగా ఫర్వాలేదులే. నాకు తలనొప్పిగా వుంది ఎటూ-టీ కూడా తాగి నట్టుంటుంది."

ప్రాణ స్నేహితురాళ్ళిద్దరూ కాంటీన్ వైపు దారి తీశారు.

" నేను మిమ్మల్ని ఎప్పటి నుంచో గమనిస్తున్నాను. మీరు బాగా పాడతారని కూడా తెలుసు. నేను జీవితంలో అందమైన అమ్మాయిల్నెందర్నో చూశానుగాని మీలాంటి అణుకువ గల అమ్మాయిని ఎక్కడా చూడలేదు. ఇన్నాళ్లుగా మనసులో వున్న మాట చెబుతున్నాను. నేను...... మిమ్మల్ని ప్రేమిస్తున్నాను.

మీ అభిప్రాయం నాకు తెలిపితే సంతోషిస్తాను. రేపు మీరు కాలేజీకి ఎర్ర ఓణీ, తెల్ల జాకెట్ వేసుకొస్తే చాలు. అంగీకారంగా భావిస్తాను.

—ఇట్లు...

మీ అభిమాని......"

ఉత్తరం పూర్తి చేసి రాణికిచ్చింది. రాణికి చాలా ఆశ్చర్యంవేసింది ఆ ఉత్తరం...... చదివి స్వప్నకి ప్రేమ లేఖ రావటం చాలా ఆశ్చర్యం కల్గించింది. నలుపుకు ఉదాహరణలా వుండి, ఎప్పుడూ నాసిరకం బట్టలు వేసుకుంటూ, ఆర్థిక హీనస్థితి కొట్టొచ్చేట్టు కన్పించే... ఆమెకు... ప్రేమలేఖ... చాలా ఆశ్చర్యం... కల్గించింది. కాలేజీ బ్యూటీ 'కృప' తర్వాతస్థానాన్ని అందంలో అందుకున్న తనకే యింత వరకూ రాలేదు. ఆఫ్ కోర్స్... వెంటపడి కామెంట్ చేసే పర్మనెంట్ బాడీ గార్డ్స్ కమ్ లవర్స్ లేకపోలేదు తనకి...

"ఏమిటే ఆలోచిస్తున్నావు?" స్వప్న మాటలకి తేరుకుంది.

"ఏం లేదు" అంటుండగా థర్డ్ అవర్ అయినట్టుగా బెల్ మోగింది. ఇద్దరూ క్లాస్ వైపు అడుగులు వేస్తూ ఉత్తరం గురించి ఎవరికీ చెప్పకూడదని నిర్ణయించుకున్నారు.

కాని వారం రోజుల కల్లా రాణి, స్వప్నల క్లాస్ ఫ్రెండ్సందరికీ ఈ విషయం తెలిసిపోయింది. విషయం తెలిసిన అందరూ స్వప్నని ఆటపట్టిస్తున్నారు. స్వప్న మాత్రం "నాకేం తెలియదు"...... అంటూ అందర్నీ తప్పించుకుంటూ తిరుగుతోంది.

ఒక రోజు ఉదయం మామూలుగా కాలేజీకి బయల్దేరుతూ రాణి... దారిలో స్వప్న యింటికి వెళ్ళింది. వెళ్లగానే వాళ్ళమ్మ "యిప్పుడే పచారీ షాపుదాకా వెళ్ళింది. కూర్చో" అని చెప్పింది.

రాణి "ఫర్వాలేదులెండి" అని అక్కడున్న పాత అల్మారాలో వుంచిన 'స్వప్న' పుస్తకాల వైపు నడిచి ఒక్కో పుస్తకం పైపైనే తిరగేస్తోంది. అంతలో ఆమెకు ఒక నోట్ పుస్తకంలో కన్పించిన ఎర్రటి స్కెచ్ పెన్‌తో వ్రాసిన అక్షరాలు చూడగానే...... బుర్రలో ఏదో ఆలోచన తళుక్కుమని...... గబగబా అక్కడే వున్న మిగతా పుస్తకాలన్నీ వెతికి వెతికి వారం రోజుల క్రితం వచ్చిన 'లవ్ లెటర్' తీసి... పుస్తకంలో వున్న అక్షరాలతో పోల్చి చూసుకుంటే... ఒకటిగా తేలింది.

అంటే... స్వప్నయే తనకు తాను ఉత్తరం వ్రాసుకొని తనలోని కోరికకు ఒక తృప్తిని ఏర్పరుచుకుందన్న మాట. తనలోని లోపాలు దిగమింగలేక తనకంటూ ఒక ప్రత్యేకతను ఆపాదించుకొన్న ప్రాణ స్నేహితురాలి అంతర్యం అర్థం చేసుకొన్న... రాణి మనసు... స్వప్నపై జాలితో నిండిపోయింది.

## కొబ్బరి బర్ఫీ

3 కప్పుల తరిగిన తాజా కొబ్బరి

2 1/2 కప్పుల పంచదార

3/4 కప్పు పాలు

బుష్ సుగంధ ద్రవ్యాలు మరియు యాలకుల సువాసనలతో

బుష్ ఎరుపు, ఆకుపచ్చ మరియు పసుపుపచ్చ రంగులలో పాలు మరియు పంచదారతో ద్రవమిశ్రమాన్ని తయారుచేయండి. కొబ్బరిని కలపండి మరియు గట్టిపడేవరకు సన్నని సెగపై వేడి చేయండి. మీ ఎంపిక మేరకు బుష్ రంగును కలపండి. కొంచెం బుష్ సుగంధాలు మరియు యాలకుల సువాసనలను జొప్పించండి. ఆ మిశ్రమాన్ని పాత్ర అంచులను వదిలేవరకు వేడి చేయండి. ఆ మిశ్రమాన్ని నూనె రాసిన బోర్డుపై సమానంగా పరచండి. చల్లబడినప్పుడు చతుర్రసం గా కోయండి.






18-8-1989 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక